## పేషెంట్ చెప్పే కథలు



# ప్రతిఫలం

సంధ్య అధరాలపై విరిసిన నవ్వులు నక్షత్రాలై ఆకాశంమీద పరుచుకుంటున్నాయి. అల్లనల్లన జారుతున్న సన్నసన్నటి తుంపర మెల్లమెల్లగా వీస్తున్న గాలితో కలసి కదం కదుపుతూ సర్వజగత్తునూ పులకరింపజేస్తోంది.

శ్రద్ధగా శబ్దాన్నాలకించిన అశ్విని ఒక్క పరుగుతో వాకిట్లోకి వచ్చింది.

"ఇంత ఆలస్యంగానా ఇంటికి రావడం?!" అశ్విని కంఠం మెత్తగా, మధురంగా వుంది. స్కూటర్‌ని ఆపిన రఘువీర్ ఆమెను గమనించనట్లు నటించాడు.

"అయ్యో! తలంతా తడిసిపోయింది." భర్తచెయ్యి పట్టుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన అశ్విని అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి పమిట చెంగుతో తల తుడిచింది. అతనికి యిష్టమయిన యిలాంటి సన్నివేశంలో ఆమె వ్రేళ్ళ చివర్ల స్పర్శతో ఉత్తేజితుడై ఎగసిపడే ఉత్తుంగ తరంగంలా ఆమెను చుట్టేసే రఘు నిర్లిప్తంగా కూర్చున్నాడు.

"ఏమిటండీ అంత డల్‌గా వున్నారు? ఒంట్లో బాగోలేదా?" ఆదుర్దాగా భర్త నుదుటిమీద చెయ్యేసి చూసింది అశ్విని.

"ఏమీ లేదులే" కనుబొమలు ముడుస్తూ విసుగ్గా చూశాడు రఘువీర్. అతని ప్రవర్తనకు చిన్నబుచ్చుకొన్న అశ్విని మౌనంగా అతనికి సపర్యలు చెయ్యసాగింది. భోజనాలయ్యాక అన్నీ సర్దుకుని పడక గదిలోకి వచ్చింది.

"ఇక్కడెందుకు? అవతల రూమ్‌లో పడుకో" కటువుగా అంటున్న అతనివొంక తెల్లబోయి చూసింది అశ్విని.

"ఏమిటి మీ ఉద్దేశ్యం?" రోషంతో కంపాయమామె చెక్కిళ్ళు.

"నీకింకా కొన్నాళ్ళు రెస్ట్ యివ్వాలని చెప్పింది డాక్టర్." ఇదెంత పెద్ద అబద్ధమో తెలుసు అశ్వినికి. క్రితం సారి పరీక్ష చేయించుకోవటానికి వెళ్ళినప్పుడే మామూలుగా దాంపత్య జీవితాన్ని గడపవచ్చని చెప్పింది డాక్టరు. ఐనా ఎందుకైనామంచిదని యిన్నాళ్ళూ ఆగి యివాళ మరోసారి డాక్టరుతో చూపించుకోవటానికి వెళ్ళింది. తన అనుమానాల్ని విని నవ్విందామె.

"గర్భకోశం తీసే ఆపరేషన్ చేయించుకుంటే యింక దాంపత్యజీవితం గడపడానికి పనికిరారని అనుకుంటున్నావులావుంది నీ అనుమానాల్ని వింటుంటే. క్రిందటిసారి వచ్చినప్పుడే చెప్పాను కదా మామూలుగా వుండొచ్చని."

తనతో అలా చెప్పినామె ఈయనతో మరోలా ఎందుకు చెప్తుంది? తనంటే యీయన విసుగుకు, నిరాసక్తతకు అసలు కారణమేమిటో తనకు చూచాయగా తెలుసు. అది ఎంతవరకు నిజమో తేల్చుకోవాలి. "నా రెస్టుసంగతి సరే, యిక్కడ పడుకోవడానికేమయింది?" అతని ప్రక్కన చోటు చేసుకుని పడుకుంది అశ్విని.

"గెటప్! అవతలికి పొమ్మని చెప్తుంటే...." ఆవేశంగా అశ్విని రెక్క పట్టుకుని గుంజి లేపాడతను.

తల వంచుకుని నుంచున్న అశ్విని హృదయం అవమానంతో మండిపోతుంది. పుట్టింటినుంచి వచ్చినప్పటినుంచి ఆయన ప్రవర్తనలో మార్పు కొట్టొచ్చినట్లు కన బడుతున్నా తన భర్తకు తనమీదున్న ప్రేమ చెక్కుచెదరదని భ్రమిస్తూంది. తను అనవసరంగా అనుమానపడుతూందని మందలించుకుంది.

"మీవారిమీద చాడీలు చెప్తున్నానని అనుకోకండి. సమయం మించిపోకముందే మీకు తెలిస్తే మంచిదని చెప్పడానికొచ్చాను. ఆయన మా కొలీగ్ ఒకామెను పెళ్ళిచేసుకునే ప్రయత్నంలో వున్నారు. మీకు ఆపరేషనవడంతో యింక పిల్లలుపుట్టే ఆశలేదని పిల్లలకోసం ఆమెను పెళ్ళిచేసుకుంటున్నానని ఆయన ఫ్రెండ్స్‌తో చెప్పుకుంటున్నారు." ఆయన ఆఫీసులో పనిచేస్తున్న విమల నిన్న పనిగట్టుకుని వచ్చి చెప్పింది.

ఆమె చెప్పింది విన్నాక కూడా ఆమె చెప్పింది అబద్ధమేమోనన్న ఆశ ఏమూలో వుంది. యిప్పుడీయన నిర్లక్ష్యం, విసుగు, అహం చూశాక ఆమె మాటలు నమ్మక తప్పడంలేదు. కాని.... తనకు ఆపరేషన్ ఇప్పుడయింది. తమకు పిల్లలు పుట్టకపోవడానికి కారణం ఆయన వీర్యంలోని లోపమని, తనలో ఏవిధమైన లోపమూ లేదని ఎనిమిది సంవత్సరాల క్రితమే అన్ని పరీక్షలూ చేసి నిర్ధారించింది డాక్టరు. తమకు పిల్లలు కలగకపోవటానికి కారణం ఆయనలోని లోపమేనని తనకూ, ఆయనకూ స్పష్టంగా తెలుసు. ఆత్మన్యూనతతో ఆయనెక్కడ క్రుంగిపోతారోనని కలత చెందుతూ యింకా ఎక్కువ ప్రేమగా, ఆదరంగా ఆయనను చూసుకుంది. పిల్లలు లేనంత మాత్రాన ఏమీ కొంపమునిగిపోదని నచ్చజెప్పి ధైర్యం నూరిపోసింది. చిన్నారి పాపాయిలగురించి కోటి కలలు కన్న తను తన కలల్ని గుండెల్లోనే అణిచేసుకుని అతనికోసం బలవంతాన చిరునవ్వుని అతికించుకుంది. తన గొడ్రాలితనాన్ని అందరూ ఎత్తిచూపుతుంటే, వంశోద్ధారకుల్ని కనలేని కోడలు దొరికిందని అత్తింటివారు సూటీపోటీ మాటలంటూంటే మౌనంగా భరించింది. చుట్టుప్రక్కల యిళ్ళల్లో పువ్వుల్లా వికసిస్తున్న ఏ పాపాయిని చూసినా తన బ్రతుకు నిష్ఫలంగా గడిచిపోతూందని క్రుంగిపోయి, అంతలోనే ధైర్యం చెప్పుకుని తన నిరాశను, అసంతృప్తిని తనలోనే దాచేసుకుని తన ప్రేమనూ, ఆప్యాయతనూ మాత్రమే పంచిందతనికి. దానికిదా ప్రతిఫలం ?!.... ఇంత కపటం!.... ఇంత ద్రోహం!.... ఇంత కృతఘ్నత.... అశ్విని హృదయంలోని పుష్పవాటికలు తగలబడిపోతున్నాయి.

—డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి